కథ

# బాకీ

అమెరికా నుంచి వచ్చిన సాంబశివరావు హైదరాబాద్‌లో ఒక రోజు విశ్రాంతి తీసుకుని గుంటూరు బయల్దేరాడు. ఇంటర్‌సిటీ గుంటూరు స్టేషన్ చేరేసరికి పన్నెండు దాటింది. లగేజి తీసుకుని స్టేషన్ బైటకు వచ్చాడు.

'ఇప్పుడు తను ఎక్కడికి వెళ్లాలి?' అని కొంతసేపు ఆలోచించాడు.

కొత్తపేటలో మేనమామలు ఇద్దరున్నారు. తమ కుటుంబం దిక్కులేకుండా ఉన్నప్పుడు, తన చదువుకి డబ్బు లేనప్పుడు ఎవరూ ఆదుకోలేదు. పైగా చిన్న చూపు చూశారు. ఇప్పుడు తను ప్రయోజకుడై అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. కాబట్టి మర్యాదగా చూస్తారు. కానీ తనకే ఇష్టం లేదు. మనిషి విలువ డబ్బును బట్టేనా? బంధుత్వం, మానవత్వం వంటివి పనికి రాని బంధాలేనా?


ఇంకా ఆ రోజుల్లో దూరపు బంధువులు, అరండల్‌పేటలో పాత గుంటూర్లో ఉన్నారు. ఇప్పుడు ఎవరింటికీ వెళ్లకూడదు. తను పనిమాలా వచ్చింది ఆంజనేయులు మాస్టారి బాకీ తీర్చుకోవడం కోసం. బాకీ అంటే డబ్బు బాకీ కాదు. ఆయన తన జీవితానికి మార్గదర్శనం చేశాడు. తన పలుకుబడి వినియోగించి ఇంజనీరింగ్ చదవడానికి స్కాలర్‌షిప్ ఇప్పించాడు. లేకపోతే తన చదువు ఇంటర్ దగ్గరే ఆగిపోయేది. గుంటూర్లోనే చిన్న చిన్న ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ, ఏ పొగాకు కంపెనీలోనో, పత్తిమిల్లులోనో గుమస్తాగా పడి ఉండేవాడు.

''సార్? ఎక్కడికెళ్లాలి?'' ఆటోవాలా ఆశగా సాంబశివరావు ముఖంలోకి చూస్తూ అడిగాడు.

''సుదర్శన్ హోటల్‌కి'' అని నడిచాడు.

లంచ్ చేశాక కాసేపు హోటల్ రూములో పడుకున్నాడు. నాలుగు గంటలకు లేచి 'టీ' తెప్పించుకుని తాగి బయల్దేరాడు.

ఇప్పుడు మాస్టారు ఇంటికి వెళ్లి ఆశ్చర్యపరచాలి అనుకున్నాడు. ఆంజనేయులు మాస్టారు చేసిన సహాయానికి ఏమిచ్చినా బాకీ తీరదు. మరి ఇప్పుడు తను ఆయనకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలడు? అగ్రహారంలో ఆయన ఒక పెంకుటింట్లో ఉండేవాడు.




అది స్వంతదో? లేక అద్దెకు ఉంటున్నాడో తనకి తెలియదు. స్వంతదే అయితే తను దగ్గరుండి మూడంతస్తుల మేడ కట్టించి ఇస్తాడు. పాత పెంకుటిల్లు పడగొట్టిస్తాడు. అద్దెదే అయినా తను కొని ఇస్తాడు. అన్నట్లు ఆంజనేయులు మాస్టారికి పిల్లలు ఎందరు? ఏమో తనకు తెలియదు. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఉండి ఉంటారు. మూడంతస్తుల మేడ వారికి కంఫర్టబుల్‌గా ఉంటుంది.

సాంబశివరావు ఆలోచిస్తూనే ఆంజనేయులు మాస్టారు ఇంటికి వచ్చేశాడు.

ప్రహరీ గోడ తలుపులు మూసి ఉన్నాయి. తలుపు కొట్టాడు.

కాసేపటికి తలుపులు తెరుచుకున్నాయి. ఎవరో ఒక యువకుడు కనిపించాడు.

''ఎవరు కావాలండీ?'' సాంబశివరావుని ఎగాదిగా చూస్తూ ప్రశ్నించాడు.

''ఆంజనేయులు మాస్టారు?'' అన్నాడు.

''ఆయన రిటైరైపోయారండీ''

''రిటైరైపోయారా?''

''ఔనండీ. ఇప్పుడు ఇక్కడ ఉండడం లేదు. తెనాలిలో ఉంటున్నారు'' చెప్పాడు ఆ యువకుడు.

''అడ్రస్ ఉందాండి?''

''ఉందండీ. రండి లోపలకు ప్లీజ్. మీరు మాస్టారికి ఏమవుతారు?''

''నేను ఆయన స్టూడెంట్‌నండీ'' అంటూ అతని వెంట లోపలకెళ్లాడు సాంబశివరావు. కుర్చీలో కూర్చున్నాడు.

అది పాతకాలం పెంకుటిల్లు. చుట్టూ చాలా స్థలం ఉంది. జామచెట్లు, దానిమ్మ చెట్లతో పాటు అరటి, పూలమొక్కలున్నాయి.

ఆ యువకుడు అడ్రస్ రాసిన కాగితం తెచ్చి ఇచ్చాడు.

''థాంక్యూ వెరీమచ్'' అని షేక్‌హేండ్ ఇచ్చాడు సాంబశివరావు.

''వెల్‌కమ్''

''ఒక్కమాట. ఆంజనేయులు మాస్టారు ఇక్కడ్నుంచి తెనాలి ఎందుకు వెళ్లారు?''

''ఏమోనండీ నాకూ తెలియదు''

''ఇది మాస్టారి స్వంత ఇల్లేనా?''

''అబ్బే కాదండీ. మాస్టారు ఖాళీ చేశాక నేను అద్దెకు దిగాను. ఐ యామ్ శేఖర్. మార్కెట్ యార్డులో పని చేస్తున్నాను''

సాంబశివరావు అతనికి మరొక మారు థాంక్స్ చెప్పి వెనుతిరిగాడు.

★ ★ ★

సాంబశివరావు తెనాలి వెళ్లాడు. ఆంజనేయులు మాస్టారి అడ్రస్ సులభంగానే దొరికింది.

## అంతా మాయ!

ఇలియానా ఆత్మహత్యా ప్రయత్నం చేసిందంటూ ఇటీవల వార్తలు జోరుగా షికారు చేసాయి. అయితే వీటిలో ఎలాంటి నిజం లేదని బ్యాంకాక్‌లో తన కుటుంబంతో హాలీడే ఎంజాయ్ చేస్తున్న ఇలియానా కొట్టిపారేసింది. ఇవన్నీ మీడియా సృష్టే అని తేల్చిపారేసింది. అయితే నిప్పు లేనిదే పొగ రాదన్న సంగతి తెలిసిందే. ఇలియానా కాస్త నిస్పృహలో (ఎందుకో?) వున్నందుకే ఆమెను తీసుకుని విదేశాలకు ఆమె తల్లి వెళ్లిందనేది మరో కథనం. ఇంట్లో జరిగిన ఏవో గొడవల్ని బయటికి పొక్కించినందుకు తమ పనిమనిషి ఒకర్ని పన్లోంచి కూడా తీసేసారట ఇలియానా కుటుంబసభ్యులు.

ఆయన పడక్కుర్చీలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు. ముఖంలో చాలా మార్పు కనిపించింది. జుట్టు పూర్తిగా తెల్లబడింది. ముఖంలో ముడతలు వచ్చేసి భారతీయుడు సినిమాలో అచ్చు కమల్‌హాసన్ మాదిరిగా ఉన్నాడు.

''మాస్టారూ!'' దగ్గరకు వెళ్లి పిలిచాడు.

చదువుతున్న పేపరు పక్కన పెట్టి ''ఎవరూ?'' అన్నాడు ఆంజనేయులు.

''నమస్కారం మాస్టారూ! నేను మీ స్టూడెంట్‌ని. నా పేరు సాంబశివరావు'' అన్నాడు.

ఆంజనేయులు నవ్వాడు.

''సాంబశివరావా? నా స్టూడెంట్స్‌లో ఎందరు సాంబశివరావులో! గుర్తుపట్టలేను. ఐనా మీరంతా చదువుకునే రోజుల్లో పేలగా మీసాలు వచ్చీరాని వయసులో ఉంటారు. తర్వాత చాలా మారిపోతారు. మీరు నన్ను గుర్తుపట్టగలరు. ఎందుకంటే నేను మీ గురువును గనుక. అదీగాక నేను ఇంకా మారేది ఏముంటుంది? జుట్టు తెల్లబడుతుంది. ముఖాన ముడతలు వస్తాయి. అంతేగా?'' అన్నాడు.

''నా పూర్తి పేరు కాకాని సాంబశివరావు. నా చదువు కోసం మీరు చాలా సహాయం చేశారు. మీ దయవల్ల ఇంజనీర్ అయ్యాను. ఇప్పుడు అమెరికాలో ఉంటున్నాను. అక్కడ ఉద్యోగం.''

''చాలా సంతోషం. ఇందులో నా దయ ఏముంది? నేను నిమిత్తమాత్రుడిని. జీతం తీసుకున్నాను. మీకు చదువు చెప్పాను. అంతా పైవాడి దయ. నీ అదృష్టం.''

''అలా కాదు మాస్టారూ!'' అని గతం గుర్తు చేశాడు సాంబశివరావు.

సాంబశివరావుకి తండ్రి లేడు. తల్లి ఇంట్లోనే ఇడ్లీలు, దోసెలు వేసి అమ్ముతుండేది. సాయంకాలం బజ్జీలు, వడలు, పునుగులు చేసేది. తను తల్లికి సహాయం చేసేవాడు. చుట్టాలంతా చిన్నచూపు చూసేవారు. తను బాగా చదువుకోవాలని పట్టుదలతో ఉండేవాడు. దానికి కారణం గూడా ఆంజనేయులు మాస్టారే. బీదవాళ్లు ఎదగాలంటే చదువే సాధనం. చదువుకున్న వాడు బాగుపడతాడు అని పదేపదే క్లాసులో చెప్పేవాడు. మాస్టారి ఉపదేశం సాంబశివరావుకి తారకమంత్రమైంది. పుస్తకాల పురుగయ్యాడు. క్లాసు పుస్తకాలే కాక లైబ్రరీకెళ్లి పుస్తకాలు చదివేవాడు. గొప్పవాళ్ల చరిత్రలు పఠించాడు. చాలామంది నాయకులు, వ్యాపారవేత్తలు చదువు, కృషి, పట్టుదలతో పైకి వచ్చారని గ్రహించాడు. ఇంటర్ తర్వాత ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చింది. కానీ ఫీజులకి, పుస్తకాలకి, హాస్టల్లో మెస్ బిల్లులు కట్టడానికి డబ్బు లేదు. ఇక తను పరాయి ఊరు వెళ్లి ఇంజనీరింగ్ చదవలేదు. గుంటూరులోనే డిగ్రీలో చేరాలని హిందూ కాలేజీకి వెళ్లాడు అప్లికేషన్ తెచ్చుకోవడానికి. అక్కడ యాదృచ్ఛికంగా ఆంజనేయులు మాస్టారు కనిపించాడు. ఇంటర్‌లో అతనికి వచ్చిన మార్కులు చూసి ముచ్చట పడ్డాడు. ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చిందని తెలిసి సంతోషించాడు. నువ్వు మామూలు డిగ్రీ చదివి గుమస్తా కాకూడదు. నువ్వు ఇంజనీర్ కావాలి అని ఆశీర్వదించారు.



తర్వాత సాంబశివరావుని వెంటబెట్టుకుని రామచంద్ర ప్రభు అనే పారిశ్రామికవేత్త దగ్గరికి తీసుకెళ్లాడు. ఆయన గురించి ముందుగానే చెప్పాడు. ప్రభు తన శిష్యుడు. స్కూలు ఫైనల్ వరకు తను లెక్కలు చెప్పాడు. అతను గూడా మధ్యతరగతి కుటుంబానికి చెందిన వాడే. దాతల సహాయంతో, స్కాలర్‌షిప్‌ల వలన ఇంజనీర్ అయ్యాడు. ఉద్యోగంలో ఎదుగుదల లేదని గ్రహించి స్వయంగా చిన్నపరిశ్రమ మొదలుపెట్టాడు. ఎంతో ఎత్తుకు ఎదిగాడు. ఇప్పుడు వెయ్యిమందికి ఉద్యోగాలు ఇచ్చి మార్గదర్శకుడయ్యాడు.

నువ్వు గూడా ప్రభుని ఆదర్శంగా తీసుకోవాలని ఉపదేశించాడు ఆంజనేయులు. ప్రభు మాస్టార్ని గౌరవించి సాంబశివరావు గురించి తెలుసుకున్నాడు. తొంభై మార్కులు తెచ్చుకున్న అతనికి స్కాలర్‌షిప్ మంజూరు చేశాడు. మాస్టారూ మీరు నా దగ్గరికి తీసుకొచ్చారంటేనే ఇతను ఎంతో యోగ్యుడై ఉంటాడు. ఇక నుంచి సాంబశివరావు మా కుటుంబంలో సభ్యుడు. అతను ఇంజనీర్ అయ్యేవరకూ చదివిస్తాం అన్నాడు. మాస్టారు సంతోషించాడు.

''మీరు ఆనాడు ప్రభుగారితో స్కాలర్‌షిప్ ఇప్పించకపోతే మామూలు

డిగ్రీ చదవగలిగి సామాన్య గుమస్తాగా ఉండి ఉండేవాడినేమో? నేను ఈ రోజు అమెరికాలో ఇంజనీర్‌ని అయ్యానంటే అంతా మీ దయ'' అన్నాడు సాంబశివరావు.

''నా దయ కాదు. విధి. చాలా సంతోషంగా ఉంది సాంబశివరావు.'' అని ఆంజనేయులు ''స్వర్ణా!'' అని కేకపెట్టాడు.

లోపల నుంచి ఒక యువతి వచ్చింది.

''నా కూతురు స్వర్ణలత'' అని పరిచయం చేశాడు.

స్వర్ణలత నమస్కారం చేసింది. ఆమెకు సాంబశివరావు గురించి వివరాలు చెప్పాడు మాస్టారు.

''అమ్మా! మాకు టిఫిన్ పెట్టమ్మా!'' అన్నాడు.

''నేను టిఫిన్ చేసి వచ్చానండీ'' అని మొహమాట పడ్డాడు సాంబశివరావు.

''ఫర్వాలేదు లేవోయ్. మా స్వర్ణ చేసిన ఇడ్లీలు తిన్నావంటే ఇక నువ్వు అమెరికా వెళ్లవు. రోజూ ఇడ్లీలు కావాలంటావ్. అంత బాగుంటాయన్న మాట'' అని నవ్వాడు.

స్వర్ణ ఇడ్లీ ప్లేట్లు తెచ్చి ఇద్దరి మధ్యా టీపాయ్ మీద పెట్టింది. నిజంగానే ఇడ్లీలు మల్లెపూలలా తెల్లగా ఉన్నాయి. కొబ్బరి చెట్నీ, అల్లంపచ్చడి, కారప్పొడి, నెయ్యిలతో రుచిగా ఉన్నాయి.

''స్వర్ణ ఆర్డీఓ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా చేస్తోంది. తెనాలిలో పోస్టింగ్ వచ్చింది. అందుకే గుంటూరు నుంచి ఇక్కడకి వచ్చాం'' అని చెప్పాడు ఆంజనేయులు.

''మాస్టారూ! మీకొక అబ్బాయి..?'' అని ఆగిపోయాడు.

''ఉండేవాడు. కానీ చనిపోయాడు. ఇప్పుడు మాకు ఈ వయసులో స్వర్ణ ఆధారమైంది. ఆమె లేకపోతే దిక్కులేని వాళ్లమైపోయేవాళ్లం'' అని ఆంజనేయులు చనిపోయిన కొడుకుని తలుచుకుని కన్నీరు పెట్టుకున్నారు.

కొంచెంసేపటి తర్వాత ''సాంబశివరావుగారూ! నాకు ఆఫీసుకి టైమైంది. మీరు లంచ్ కూడా మా ఇంట్లోనే చేసి వెళ్లాలి. లంచ్‌టైమ్‌కి ఇంటికొస్తాను. ఆఫీసు దగ్గరే'' అని బయల్దేరింది స్వర్ణలత.

అమెరికాలో తను చేసే ఉద్యోగం, అక్కడ తెలుగు వాళ్ల కార్యకలాపాలు వగైరా చెప్పి మళ్లీ లంచ్ టైమ్‌కు వస్తానని బయల్దేరాడు సాంబశివరావు.

★ ★ ★

సాంబశివరావు ఆర్డీఓ ఆఫీసుకి వెళ్లి బైట గేటు దగ్గరే నిలబడ్డాడు. లంచ్ టైమ్ కావస్తోంది. అటూ ఇటూ పచార్లు చేశాడు. కాసేపటికి స్వర్ణలత హేండ్ బ్యాగ్ తగిలించుకుని వస్తోంది.

గేటు ముందు తచ్చాడుతున్న సాంబశివరావుని చూసి ఆశ్చర్యపోయింది.

''ఏమిటండీ ఇక్కడ ఉన్నారు? మా ఆఫీసులో మీకేమైనా పనుందా?'' అని ప్రశ్నించింది.

అతను నవ్వాడు.

'లేదండీ. మీతోనే పని'' అన్నాడు.

''నాతోనా?'' స్వర్ణలత అయోమయంగా చూసింది.

అతను తల ఊపి ''ఇఫ్ యూ డోంట్ మైండ్. ఇక్కడ కూర్చుని మాట్లాడుకుందాం'' అని ఒక సిమెంట్ బెంచీ వైపు నడిచాడు.

ఇద్దరూ కూర్చున్నారు.

''చెప్పండి'' అన్నది స్వర్ణలత తనతో ఇతనికి పని ఏమిటా? అని ఆలోచిస్తూ.

సాంబశివరావు తన గతం, ఆంజనేయులు మాస్టారు తనకు స్కాలర్‌షిప్ ఇప్పించి ఇంజనీర్ చదవడానికి చేసిన సహాయం గురించి చెప్పాడు. ఇదంతా తనకు ఎందుకు చెప్తున్నాడో ఆమెకు అర్థం కాలేదు. బహుశా ఇప్పుడు ఏదైనా ఆర్థిక సహాయం చేయడానికి చెప్తున్నాడేమో! మాస్టారు మొహమాటంతో డబ్బు తీసుకోవడానికి ఇష్టపడడు గనుక తనకు ఇస్తాడేమో? అనుకుంది.

''ఇప్పుడు నేను ఆంజనేయులు మాస్టారి బాకీ తీర్చుకోవాలనుకుంటున్నాను. లేకపోతే నేను మాస్టారుకి ఋణపడి ఉన్నాననే భావం జీవితాంతం వేధిస్తూ ఉంటుంది'' అన్నాడు.

తను ఊహించింది కరక్టే అని నవ్వుకుంది స్వర్ణలత.

''ఇందులో మీరు ఋణపడింది ఏముంది? ఆయన చేసింది కేవలం మాట సాయమేగా?'' అన్నది.

''కావొచ్చు. అది నా జీవితాన్ని మలుపుతిప్పింది''

''పోనీ బాకీయే అనుకుందాం. ఇప్పుడు ఏ విధంగా తీర్చుకుంటారు? మాస్టారు సంగతి మీకు తెలిసే ఉండాలి. ఆయన ఎవరి దగ్గరా చెయ్యి చాచరు. ఇప్పటికీ ఉచితంగా చదువు చెప్తుంటారు'' అన్నది

## నయనతార రికార్డు

**ఇప్పటి వరకూ దక్షిణాదిన కోటి రూపాయలు తీసుకునే హీరోయిన్‌గా ఇలియానా గురించి చెప్పుకున్న వాళ్లంతా ఇప్పుడా పేరు పాతబడిపోయిన సంగతి గ్రహించాలి. తాజాగా లింగు స్వామి దర్శకత్వంలో నటిస్తున్న నయనతార ఆ సినిమాకి గాను కోటీ పది లక్షల పారితోషికం అందుకుంటున్నట్టు కోలీవుడ్ సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటి దాకా ఇంత భారీ రెమ్యునరేషన్ డిమాండ్ చేసిన హీరోయిన్ మరొకరు లేరంటే రికార్డే కదా!**



స్వర్ణలత.

''మీరు ఏమీ అనుకోకపోతే నేను మిమ్మల్ని పెళ్లి చేసుకుందామనుకుంటున్నాను'' అన్నాడు.

స్వర్ణలత ముఖంలో రంగులు మారాయి. ఆమె ముఖం కళ తప్పింది.

''సారీ! మీరేమనుకుంటున్నారు? నా గురించి మీకు తెలియదు. నేను మాస్టారి కూతుర్ని కాదు కోడల్ని. విధవను'' అన్నది రుద్ధమైన కంఠంతో.

సాంబశివరావు విస్తుపోయాడు.

''అదేంటి మాస్టారు అలా ఎందుకు చెప్పారు? నా కూతురు అని పరిచయం చేశారే?'' ఆశ్చ ర్యంతో ప్రశ్నించాడు.

''నన్ను కోడలు అని ఒప్పుకోరు. కూతురనే అంటారు. తెనాలిలో అంతా అలానే అనుకుం టారు'' అంది స్వర్ణ.


''మాస్టారు రియల్లీ గ్రేట్. కోడల్ని కూతు రుగా లోకానికి చాటి చెప్పడం. ఐ యామ్ ప్రౌడాఫ్ హిమ్'' ఉద్వేగంతో అన్నాడు.

''ఇప్పుడు తెలిసిందిగా. పదండి లంచ్ టైమైంది'' అన్నది.

''మీరు కూతురైనా? కోడలైనా నేను నా నిర్ణయం మార్చుకోను. మీకు అంగీకారమైతేనే...''

''నేను కాదు అంగీకరించాల్సింది మా నాన్నగారు. మీరొక సంగతి తెలుసుకోవాలి. నేను మాస్టర్ గారి స్నేహితుడి కూతుర్ని. సవతి తల్లి నా పెళ్లి చెయ్యకుండా హింస పెట్టేది. పెద్ద దాన్ని నేనుండగా చిన్న పిల్లయిన తన కూతురికి పెళ్లి నిర్ణయించింది. మాస్టారు ఆమె నిర్ణయాన్ని వ్యతిరేకించారు. అంతేకాదు మా చెల్లెలు పెళ్లి కంటే ముందుగా నా పెళ్లి తన కొడుకుతో జరిపించేశారు. కట్నకానుకల ప్రసక్తి లేదు. అన్ని ఖర్చులు ఆయనే భరించారు. కానీ నా దురదృష్టం ఆయన పోయారు''

స్వర్ణలతకి గతం గుర్తొచ్చి కన్నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి.



''ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్'' అనునయంగా అన్నాడు.

''నేను మాస్టారి బాకీ తీర్చుకోవడానికే ఆయన్ని తండ్రిగా స్వీకరించి ఉంటున్నాను. నేను మళ్లీ పెళ్లి చేసుకుని ఆయనకు దూరమై ఋణపడ లేను'' అన్నది.

''జరిగింది మర్చిపోండి. ఇప్పుడు మీరు మాస్టారి పెళ్లికెదిగిన కూతురనే భ్రమలోనే జీవించండి. నేను మీతో పాటు మాస్టార్ని కూడా అమెరికా తీసుకెళ్తాను. ఇద్దరం ఉమ్మడిగా ఆయన బాకీ తీర్చుకుందాం'' ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కాడు సాంబశివరావు.

''అంతా మాస్టారి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది'' అని ఆమె సున్నితంగా తన చేతిని లాక్కుని లేచి నిలబడింది.

ఇద్దరూ బయల్దేరారు.

★ ★ ★

లంచ్ చేసిన తర్వాత ఆతని మనసులో మాట ఆంజనేయులుకి చెప్పాడు సాంబశివరావు.

ఆయన నవ్వారు.

''నా కూతురికి నువ్వు కొత్త జీవితం ప్రసాదిస్తానంటే వద్దనే మూర్ఖుడిని కాదు. నీ వంటి యోగ్యుడి చేతిలో స్వర్ణ జీవితం భద్రంగా ఉంటుందని నాకు తెలుసు. స్వర్ణతో నీ పెళ్లికి మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నాను'' అన్నాడు ఆంజనేయులు.

''హమ్మయ్య. ఇప్పుడు నా హృదయం తేలిక పడింది. మీరు ఒప్పుకుంటారో లేదోనని టెన్షన్ పడ్డాను'' అన్నాడు సాంబశివరావు.

''కానీ పెళ్లయ్యాక నేను మీతో అమెరికా రాను''

''మాస్టారూ! అదేంటి?'' తెల్లముఖం వేశాడు.

''నువ్వే ఇండియా రావాలి. ఇక్కడే నువ్వు ఏదైనా పరిశ్రమ స్థాపించి స్థిరపడాలి. ప్రభుని ఆదర్శంగా తీసుకుని ఇక్కడి వాళ్లకి ఉద్యోగాలు కల్పించాలి. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇవ్వాలి. పోనీ నీకు వ్యాపారం ఇష్టం లేకపోతే ఈ దేశంలోనే ఉద్యోగం చెయ్యి. నీ సేవలు ఈ దేశానికి ఉపయోగపడాలి'' అన్నాడు ఆంజనేయులు.

''సరే మాస్టారూ! నేను మా డాడీ దగ్గరకి వెళ్లొస్తాను''

''మీ డాడీ..?''

''రామచంద్ర ప్రభు. హి ఈజ్ మై డాడీ. నా పెళ్లి ఆయనే చేస్తారు'' అన్నాడు.

అంతా వింటున్న స్వర్ణలత సిగ్గుపడి ఇంట్లోకి వెళ్లింది.

☆

## డాన్సులు అదుర్స్!

**ఇటీవల దర్శకుడిగా 'డాన్', హీరోగా 'పార్థు' సినిమాతో పరాజయం చవిచూసిన లారెన్స్ టాలెంట్‌పై తనకెంతో నమ్మకం వుందంటున్నాడు తమిళ దర్శకుడు శక్తి చిదంబరం. తాజాగా లారెన్స్‌తో అతను తీస్తున్న 'రాజాధిరాజా' సినిమాలో ఏకంగా అరడజను మంది విలన్‌లతో లారెన్స్ ఫైట్‌లు ఈ సినిమాకి హైలైట్ అవుతాయంటున్నాడు. అంతేకాదు, ఆరుగురు హీరోయిన్లతో పాటలు కూడా వుంటాయిట ఈ సినిమాలో. ఈ పాటల్లో లారెన్స్ కొరియోగ్రఫీ అలా ఇలా కాదుట, అదురుతుందిట. చూద్దాం ఎంతగా ప్రేక్షకులు అదురుతారో!**